క్లుప్తంగా

నేడు టోకెన్ల పంపిణీ

ముధోల్: మండల కేంద్రంలో ఉన్న బిద్రెల్లి పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సూర్యపూలు(సన్ఫ్లవర్ విత్తనాలు) కొనుగోళ్ల కోసం టోకెన్ పంపిణీ చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక వేలం పూర్తి

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కే) గ్రామ శివారులో అధికారులు సీజ్ చేసిన 70 ట్రాక్టర్ల ఇసుకకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్లి (కే) గ్రామపంచాయతీలో నిర్వహించిన వేలంపాటలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారు. చాక్‌పల్లి గ్రామస్తుడైన ఎండీ.మాజీద్ రూ.36 వేలకు ఇసుక దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

డిపోలో మజ్జిగ పంపిణీ



పంపిణీ చేస్తున్న మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం సిబ్బందికి, బస్ డ్రైవర్లు, కండక్టర్లకు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఎండ తాకిడికి అప్రమత్తంగా ఉండాలన్నారు. చెవులకు, తలకు తెల్లనివస్త్రం కట్టుకోవాలని సూచించారు. త్వరలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, నవీన్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'కేజ్రీవాల్ అరెస్టు రాజకీయ కుట్ర'

నిర్మల్‌టౌన్: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు రాజకీయ కుట్ర అని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో అరవింద్‌ను నేరుగా ఎదుర్కోలేక బీజేపీ ప్రభుత్వం అరెస్టు చేసిందని మండిపడ్డారు. లిక్కర్ స్కామ్‌లో రూ.కోట్ల అవినీతి జరిగిందన్న ఈడీ ఆ డబ్బును రికవరీ చేసి కోర్టుకు ఎందుకు సమర్పించడం లేదని ప్రశ్నించారు.

స్వయంఉపాధితో ఆదాయం



శిక్షణ పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

ఖానాపూర్: ప్రతీ ఒక్కరూ స్వయంఉపాధిపై దృష్టి సారిస్తే మెరుగైన ఆదాయం సాధించవచ్చని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కొలాంగూడ గ్రామంలో శుక్రవారం గిరిజనులు చేస్తున్న స్వయంఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తుంగగడ్డితో బుట్టల తయారీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, మహేశ్, పీరియా, రవీందర్ తదితరులు ఉన్నారు.

'ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన'

ఖానాపూర్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బి.గోవిందనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు.

భూమి ఇప్పించాలని వినతి

భైంసాటౌన్: గత రాష్ట్ర ప్రభుత్వం క్రీడాప్రాంగణం పేరిట రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూమిని తిరిగి వారికి అప్పగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కోరారు. ఈమేరకు బాధిత రైతులతో కలిసి శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. లోకేశ్వరం మండలం నరసింహనగర్ తండాకు చెందిన జాదవ్ మోతీలాల్, జాదవ్ కిషన్ నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణం కోసం ఎకరంన్నర భూమిని తీసుకుందన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, ముత్తన్న, ఉన్నారు.

నూతన కార్యవర్గం

భైంసా: బాసర మండల ప్రింట్ మీడియా కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా అంతగిరి మాధవ్, అధ్యక్షుడిగా జాదవ్ దత్తు పటేల్, ఉపాధ్యక్షుడిగా దావు రాజు, ప్రధాన కార్యదర్శిగా గౌతమ్, కోశాధికారిగా శంకర్, పీఆర్‌ఓగా సాయందర్, సలహాదారులుగా విజయ్‌కుమార్, పవన్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఘనంగా జల దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



కుభీర్: పార్డి(బి)లో పని ప్రదేశం వద్ద..



కుంటాల: ఓలాలో పని ప్రదేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కూలీలు

భైంసారూరల్: భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడుకోవాలని మండలంలోని మహాగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొండ శంకర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని మహాగాం గ్రామంలో సీఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీఆర్డీ విస్తరణాధికారి వరపు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కిరడం ముత్యంరెడ్డి, తెలుగు పండితులు ముజ్జె రవి, హిందీ పండితులు పింగ్లే సారనాథ్, ఉపాధ్యాయులు జాదవ్ శివరాం, సాయారెడ్డి, విక్రాంతి, వర్ష తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

కుంటాల: వర్షపు నీటిని ఒడిసి పట్టాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండలంలోని ఓలాలో ఉపాధి హామీ కూలీలకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కుంటాలలో ఇంకుడుగుంతల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, వార్డెన్ నగేష్, కార్యదర్శులు రాజబాపు, యోగేష్, టీఏలు మాధురి, శశిందర్, జైసింగ్, కార్తీక్, ఎఫ్ఏలు రాజేశ్వర్, వాణి పాల్గొన్నారు.

కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామ సంఘ భవనంలో నీటిని పొదుపుగా వినియోగించే విధానంపై డీపీఎం విజయలక్ష్మి మహిళలకు వివరించారు. మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా సమన్వయకర్త మైత్రి ప్రవీణ్, ఏపీఎం అశోక్, మల్లేశ్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత పాల్గొన్నారు.

ఖానాపూర్: నీటి సంరక్షణ మనందరి బాధ్యత అని డ్రీం సొసైటీ కోఆర్డినేటర్ చిన్నయ్య అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, డ్రీం సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ, సిబ్బంది లావణ్య, రవీందర్, తదితరులు ఉన్నారు.

కుభీర్: మండలంలోని పార్డి(బి)గ్రామంలో సీఆర్డీ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. సంస్థ విస్తీర్ణాధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇంకుడుగుంతలను నిర్మించుకొని భూగర్భజలం పెంచుకోవాలని సూచించారు.



భైంసారూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఖానాపూర్: సింగాపూర్‌లో అవగాహన ర్యాలీ

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

మామడ: నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కొరిటికల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి అన్నారు. నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని కొరిటికల్, పొన్కల్ గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నీటి ప్రాముఖ్యతను వివరించేలా కొరిటికల్‌లో విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్డీ సంస్థ ప్రతినిధి వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు. పొన్కల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్వయంసహాయక సంఘాల సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మామడ: కొరిటికల్‌లో విద్యార్థుల మానవహారం

తానూరు: మండలంలోని ఝరి(బి) జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకొన్నారు. ఉపాధ్యాయుడు విఠల్ నీటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. దత్తు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



తానూరు: ఝరి(బి) పాఠశాలలో ప్రతిజ్ఞ

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సురేశ్ పరిశీలించారు. నీటి దినోత్సవం సందర్భంగా కూలీలకు నీటి వృథాతో కలిగే నష్టాలను వివరించారు. ఇన్‌చార్జి కార్యదర్శి లక్ష్మణ్, టీఏ కృష్ణ, సంధ్య, ఎఫ్ఏ రమేశ్, కూలీలు పాల్గొన్నారు.



సోన్: కూచన్‌పెల్లిలో కూలీలతో ఎంపీడీవో

'బ్యాంకు ఖాతాల ఫ్రీజ్ అప్రజాస్వామికం'



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

భైంసాటౌన్: ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఆదాయ పన్ను పేరిట కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం పార్టీ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్‌ను నిరసిస్తూ బ్లాక్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో భైంసాలోని బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి సింధే ఆనంద్‌రావు పటేల్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. బీజేపీ ఖాతాలను సైతం ఫ్రీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు భూమన్న, అహ్మద్‌ఖాన్, రాథోడ్ జయరాంనాయక్, ఓంప్రకాశ్ లడ్డా, రాంచందర్ రెడ్డి, మండలాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గంటలో ముగించేశారు..

- సాదాసీదాగా నర్సాపూర్(జి) మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్యాంకుమార్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా గంటలోపే ముగిసింది. ఆయా శాఖల అధికారులు హాజరై తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

- ఎంఈఓ కస్తూరి శంకర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఈనెల 30తో పరీక్షలు పూర్తవుతాయన్నారు. మిగతా తరగతుల వారికి ఏప్రిల్ 8 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయని తెలిపారు.
- ఏవో జాదవ్ సాయికిరణ్ మాట్లాడుతూ రైతులకు డీసీఎంఎస్, పీఏసీఎస్ సెంటర్లలో యూరియా అందుబాటులో ఉందన్నారు. పంటల వివరాల నమోదు పూర్తయిందని తెలిపారు.
- డీఆర్డీఏ ఐకేపీ సీసీ ముత్యం మాట్లాడుతూ యాసంగి వరి ధాన్యాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతలు ఎస్‌హెచ్‌జీ(స్వయంసహాయక సంఘాలు) సభ్యులకు ఇస్తున్నట్లు తెలిపారు.
- మత్స్యశాఖ అధికారి గయాసొద్దీన్ మాట్లాడుతూ మండలంలోని 20 చెరువులు, కుంటల్లో 8,26,975 పెద్ద, చిన్న చేప పిల్లలను రాయితీపై వదిలినట్లు పేర్కొన్నారు. నర్సాపూర్(జి), గొల్లమాడ గ్రామాలలో మత్స్య సహకార సంఘ భవనాలు పూర్తయినట్లు తెలిపారు.
- వైద్యాధికారులు అమృతయాని, శ్యాంకుమార్ మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరం వేడెక్కడం, విపరీతమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.
- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదేవి మాట్లాడుతూ మండలంలో ఐదు అంగన్‌వా డీ టీచర్ల పోస్టులు, ఏడు హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జెడ్పీటీసీ చిన్నరామయ్య, వైస్ ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ వాహిదొద్దీన్, ఎంపీటీసీ మల్లేశ్, కోఆప్షన్ సభ్యులు ఫసి, అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం

నర్సాపూర్(జి): పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి సూచించారు. పోషణ్ పక్వాడాలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజనీదేవి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కుభీర్: పోషణ్ పక్వాడాలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పోషణ్‌పక్వాడాలో భాగంగా మండలంలోని సింగాపూర్ గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపంతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రాధిక, సుమలత, లావణ్య తదితరులు ఉన్నారు.



నర్సాపూర్(జి) ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ నాగమణి



కుభీర్‌లో..

తానూరు: పోషన్ పక్వాడాలో భాగంగా మండలంలోని బెల్‌తరోడా అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ అనిత పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కడెం: అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్, రానిగూడ, కొర్రతండా పంచాయతీల పరిధిలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాలను వారు తనిఖీ చేశారు.



కడెం : గంగాపూర్‌లో పరిశీలిస్తున్న సీడీపీవో సరిత

ఈసందర్భంగా భోజనం, రికార్డులు పరిశీలించారు. గర్భి ణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట సూపర్‌వైజర్ షహనాజ్ పర్వీన్ ఉన్నారు.

సమయపాలన పట్టించుకోరా..?



ఈ చిత్రంలో కనిపిస్తున్నది లక్ష్మణచాందలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రం. ఉదయం ఎనిమిది గంటలకు తెరవాల్సిన కేంద్రం.. 8:45 గంటల వరకు కూడా తాళం వేసే ఉంది.



ఈ చిత్రంలో కన్పిస్తున్నది మండలంలోని మల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రం. ఇక్కడికి 8:30 గంటలకు వెళ్లగా కేంద్రాన్ని తెరిచి టీచర్ మళ్లీ బయటకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

- సకాలంలో తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇష్టానుసారంగా సిబ్బంది విధులు
- పట్టించుకోని అధికారులు

లక్ష్మణచాంద: ఐసీడీఎస్ అధికారుల ఆదేశాలతో వేసవిలో ఎండల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. లక్ష్మణచాంద మండలంలో 37 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కానీ ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 80 శాతం మంది టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టానుసారం విధులకు హాజరవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

'సాక్షి' పరిశీలన

శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను 'సాక్షి' పరిశీలించింది. క్షేత్రస్థాయిలో కేంద్రాల్లో ఎక్కువ మంది సిబ్బంది సమయపాలన పాటించడం లేదని తేలింది. మండలంలోని ధర్మారం అంగన్‌వాడీ కేంద్రంలో ఉదయం 8:15 గంటల వరకు టీచర్ రాలేదు. కేవలం ఆయా మాత్రమే విధులు నిర్వర్తిస్తుంది.

అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా అధికారులు స్పందించి.. గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



ఈ చిత్రంలో కన్పిస్తున్నది లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ అంగన్‌వాడీ కేంద్రం. ఉదయం 8:10 గంటల వరకు కేంద్రం తెరిచి ఉండకపోవడంతో చిన్నారులెవరూ రాలేదు.

సమయపాలన పాటించాలి

వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తెరిచి ఉంచాలి. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.

– భాగ్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ లక్ష్మీనారాయణ స్వామి సహిత రాజ్యలక్ష్మీ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేద పండితులు సంతోష్ జోషి, గోవింద్‌రావు ఆధ్వర్యంలో శాంతిపాఠం, మహాసంకల్పం, గణపతి గౌరి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, మండప పూజ, గోపూజ, వాల్మీక పూజ, అంకురారోపణం, మహాభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్, సాయన్న, మహిపాల్‌రెడ్డి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



హోమం జరిపిస్తున్న పండితులు

'ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేయించాలి'

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని శుక్రవారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను బీజేపీ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట వారు మాట్లాడారు. రూ.140 కోట్లతో నిధులు తెచ్చి పనులను ప్రారంభించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి రమేశ్, మాజీ ఉప సర్పంచ్ దశరథ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ముత్యంరెడ్డి తదితరులున్నారు.

సభ విజయవంతం చేయండి

ముధోల్: భైంసాలో ఆదివారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షుడు ముత్యంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి సీతక్క హాజరయ్యే ఈ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కాంగ్రెస్ సోన్ మండల కార్యవర్గం



నూతన కార్యవర్గం

సోన్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాల మేరకు శుక్రవారం సోన్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా నక్కల మధుకర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా అల్లూరి రాజురెడ్డి, ఉపాధ్యక్షులుగా గడ్డం స్వామి, సముందర్‌పెల్లి సాయన్న, కార్యదర్శులుగా తిరుమల భోజన్న, కొప్పుల నర్సారెడ్డి, ఉప కార్యదర్శిగా సోలంకి కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా దర్శనం లింగన్న, కోశాధికారిగా నేరడి శివరాం, సలహాదారుగా ఈలసరం లింగన్న, మైనార్టీ విభాగం సభ్యులుగా అబుద్, ఈసీ విభాగం సభ్యులుగా విశ్వనాథ్, భూమారెడ్డి, విఠల్‌ను ఎన్నుకున్నామని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

ఖానాపూర్: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతోపాటు వడదెబ్బల బారిన పడకుండా తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్య శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధి కూలీలకు పనిప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: ఎండలు పెరుగుతున్నందున ఉపాధి కూలీలు ఉదయమే పనులకు వెళ్లి త్వరగా ఇళ్లకు చేరుకోవాలని ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ సర్పరాజ్ నవాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యురాలు చందన మాట్లాడుతూ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎంపీవో అనిల్, ఆరోగ్యవిస్తరణాధికారి వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నిర్మల్: సారంగపూర్ మండలంలోని జామ్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కాడిగె సునీల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా మృతికి కారణాలను తెలుసుకున్నారు. సునీల్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్, పలువురు నాయకులు రాంశంకర్‌రెడ్డి, సాహెబ్‌రావు, తిరుమలచారి, తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

పశువులను రోడ్లపైకి వదలొద్దు



మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: రోడ్లపైకి వచ్చే పశువులతో ప్రమాదాలు జరుగుతున్నాయని.. యజమానులు తమ పశువులను రోడ్లపై వదిలితే గోశాలలకు తరలిస్తామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రోడ్లపై తిరిగే పశువులను యజమానులు తమ ఇళ్లకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్ కిశోర్‌నాయక్, శంకర్, సిబ్బంది ఉన్నారు.